గురువులు

# వసిష్ఠ మహర్షి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123



" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

**http://ebooks.tirumala.org**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# వసిష్ఠమహర్షి

శ్రీ జి.జి.వి.ఆర్. రామానుజాచార్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 20

# వసిష్ఠమహర్షి

రచన

శ్రీ టి. టి. వి. ఆర్. రామానుజాచార్యులు

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 20

**VASISTHAMAHARSHI**

by

***Sri G.G.V.R. Ramanujacharyulu***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Lasertypeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా ! ఎటువంటి కర్తవ్యదీక్ష ! ఎంత విశాలదృష్టి ! ఎటువంటి విశ్వకల్యాణభావన ! ఎంతటి ధార్మిక చేతన !'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -


**ఈ వేద కథా భారతి.**

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ



# మనవి

వేద కథాభారతి.

అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.


ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ

బహుళ - సప్తమి

5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# వశిష్ఠమహర్షి

**మానవజాతికే తలమానికం :**

వేలకొలది సంవత్సరాలుగ భారతజాతి మహోన్నత్యం విశ్వానికి ఆదర్శంగా నిలబడుతూ వుంది. యావద్విశ్వం నిద్రాణంగాను, అనాగరికంగాను ఉండేకాలంలోనే ఈ జాతి జాగృతమై, అద్భుతమైన నాగరికతకు పుట్టినిల్లై, అసదృశమైన సంస్కృతీ సంప్రదాయాలను నెలకొల్పింది. అప్పుడప్పుడు, అక్కడక్కడ పుట్టిన నాగరికతలు కాలగర్భంలో కలసిపోయినా భారతీయ సంస్కృతి, నాగరికతలు మాత్రము ఆత్మస్వరూపం చెడకుండా అనేక నవ్యరీతులను కాలానుగుణంగా సంతరించుకుంటూ సజీవనదిలాగా నిరంతరంగా ప్రవహిస్తూనే ఉన్నాయి. ఈ జాతి విశ్వమునకు తలమానికమై, విశ్వగురువై పరిఢవిల్లింది. అవిచ్ఛిన్నమైన ఈ సంస్కృతీ ప్రాభవానికి కారణం దానికి వారసత్వంగా లభించిన 'వేదం' అంటే అతిశయోక్తి కాదు.

**వేదం విశ్వజనీనం :**

భారతజాతికి పరమప్రామాణికమైనది ఈ వేదం. మానవుని యొక్క అతిప్రాచీన శబ్దాన్ని, భావజాలాన్ని పొందుపరచుకొన్న అద్భుత సాహిత్యం వేదం. దీన్ని అపౌరుషేయమని భారతజాతి గౌరవముగా చెప్పుకొంటున్నది. అనాది, అనంతం ఈ వేదం అని ఈ జాతి

విశ్వసిస్తున్నది. ఎన్నో పర్యాయాలు దీని ప్రమాణాన్ని ప్రశ్నించడానికి అనేక ఉద్యమాలు జరిగినాగాని అవి ఏవీ సఫలం కాలేదు. వేదము యొక్క ప్రామాణికత ప్రతి కాలంలోను పెరుగుతూనే వచ్చింది. సామాన్యజన వ్యవహారంలో విడదీయరాని విషయంగా రూపొందింది. వేదనిందకులు కూడ వేదం ప్రమాణం అన్న విషయాన్ని 'నేను చెప్పిందే వేదం' అనే జాతీయాన్ని అతర్కితంగానే తమ వ్యవహారంలో ఉపయోగిస్తూ ఉంటారు. దీని ప్రామాణ్యానికి ఇంతకంటే రూఢి ఏం కావాలి?

**ఋషిమార్గం :**

వేదములు అపౌరుషేయములైతే అవి లోకానికి ఎట్లా తెలిసినవి అంటే తపస్సంపన్నులైన మహర్షులు అతీంద్రియ శక్తి ద్వారా వేదాన్ని దర్శించి లోకానికి అందించారు అని మన విశ్వాసం. ఆ విధంగా వేదములను దర్శించిన మహర్షులు వేదద్రష్టలైనారు. వారు దర్శించి తమకు చూపిన మార్గంలో పయనించి భారతజాతి కృతార్థమైంది.

**ఋషి, మహర్షి, రాజర్షి, బ్రహ్మర్షి :**

భారతజాతి జీవితానికి దీపం చూపినవారు ఋషులు. ఋషి అంటే అతీంద్రియశక్తిద్వారా చూచేవాడు. అతడు జ్ఞాని కావడం మాత్రమే కాదు. అతడికి కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి. సాధుస్వభావమతని జీవనం. అయితే, సాధుత్వ రక్షణ కోసం, లోక సంగ్రహణం కోసం అవసరమైతే ఆగ్రహిస్తాడు. సదాచార పరాయణుడు. సన్మార్గప్రవర్తనుడు. సుఖాలకు అతి దూరంగా కృత్రిమత్వానికి అవకాశం యివ్వకుండా అతి సహజంగా, ఆదర్శవంతంగా జీవించడం యితడి వైశిష్ట్యం. తాను తెలుసుకున్న జ్ఞానం

వల్ల తనకు మాత్రమే లాభం కలగాలని అనుకునే సంకుచితత్వం కలవాడు కాడు. పైపెచ్చు సుఖాలను అనుభవించడానికి ఎన్నో అవకాశాలున్నా వాటిని త్రోసిరాజని కష్టాలనే వరిస్తూ తపోనిష్ఠలో వుంటాడు. ఈ గుణాలన్నీ కలిస్తే అతడు ఋషి. రాజర్షులు, మహర్షులు, బ్రహ్మర్షులు అని ఋషులలో తరతమ భేదాలున్నాయి. ఋషి వాచకం సామాన్యం. పైన చెప్పిన గుణాల్లో ఏవో కొన్నింటిని కలిగి వుంటాడితడు. క్లిష్టమైన రాజధర్మాన్ని నిర్వర్తిస్తూ స్వపర భేదాన్ని, తప్పక పాటించవలసిన రాజులలో కూడ ఋషిత్వముండవచ్చు. అట్టివారిని రాజర్షులంటారు. మహర్షి అంటే ఋషి గుణాలను అన్నింటినీ పుణికి పుచ్చుకొని లోకసంగ్రహణం చేసేవాడు. అయితే ఇతనికి అహంకార మమకారాలు పూర్తిగా తొలగిపోవు. వీటిని కూడా తొలగించుకొని సంపూర్ణమైన ఇంద్రియనిగ్రహాన్ని, మనోనిగ్రహాన్ని సంపాదించుకొన్న జ్ఞాని బ్రహ్మర్షి అవుతాడు. అటువంటి వాళ్ళు ఒకరో, ఇద్దరో మాత్రమే వుంటారు. ఆ కోవకు చెందినవాడు వసిష్ఠమహర్షి.

**వసిష్ఠుడు : వశిష్ఠుడు :**

వసిష్ఠునకు, వశిష్ఠునిగా కూడ వ్యవహారం వుంది. రెండూ సార్థక నామధేయాలే. వసిష్ఠుడు అంటే వసించే వాళ్ళందరిలో శ్రేష్ఠుడు. వసించే విధానాన్ని, వసించుటలోని సాఫల్యాన్ని సంపూర్ణంగా తెలుసుకున్నవాడు. వశిష్ఠుడనగా సర్వతోముఖమైన వశిత్వము సంపాదించిన వారందరిలో శ్రేష్ఠుడు. ఈ రెండూ కూడ వసిష్ఠునిలో సంపూర్ణంగా విలసిల్లుతూ వున్నాయి.

వసిష్ఠ మండలం :

ఋషుల మూలం తెలుసుకోవడానికి ప్రయత్నించరాదని పెద్దల మాట. ప్రయత్నించినా ఫలితం వుండదు. మహానుభావుల చరిత్రలన్నీ అనేకములైన ఐతిహ్యాలకు లోబడి అసలు విషయాన్ని మరుగుపరుస్తాయి. ఆధునిక కాలంలో కూడ యిలాంటి వాటికి అనేక ఉదాహరణలు లభిస్తాయి. మరి అత్యంత ప్రాచీనమైన ఋషుల చరిత్రలు ఇదమిత్థంగా తెలుసుకోవడం ఎలా సాధ్యమౌతుంది? అయినప్పటికీ ప్రయత్నం చేయడం పండిత లక్షణం. వేదం ద్వారా వసిష్ఠుని గురించి కొన్ని విషయాలు మనకు తెలుస్తూవున్నాయి. ఋగ్వేదంలో 7 వ మండలాన్ని వసిష్ఠమండలంగా చెప్తారు. దానిలోనూ, మరికొన్ని చోట్లా లభిస్తున్న విషయం ఆధారంగా వసిష్ఠుని కథను తెలుసుకుందాం !

మంత్రద్రష్ట :

వైదిక పరంపరలో పౌరోహిత్య విశేషాలతో సంపన్నుడైన వ్యక్తిగా వసిష్ఠ మహర్షి పేర్కొనబడ్డాడు. ఋక్సంహితలో గల సూక్తాలలో ఎక్కువ సూక్తాలను దర్శించిన మహర్షి వసిష్ఠుడు. మొత్తం 104 సూక్తాలను ఈయన దర్శించినట్లు మనకు ఋగ్వేద సంహిత ద్వారా తెలుస్తున్నది. ఋగ్వేదం 7-18 లో వసిష్ఠుని నేతృత్వంలో సుదాసునికి చేసిన సహాయం ప్రస్తావించబడింది. వసిష్ఠమహర్షి కృష్ణయజుస్సంహితలో 53 మంత్రాలను దర్శించాడు. సామసంహితలో 43 దశతుల్లో కొన్ని మంత్రాలకు ద్రష్ట వసిష్ఠ మహర్షి. ఇతడు అథర్వవేదంలో 14 సూక్తాలను దర్శించాడు. ఈ విధంగా వసిష్ఠమహర్షి నాలుగు వేదాలలోని మంత్రాలను దర్శించిన మహనీయుడైనాడు.

**మూడు జన్మలు :**

ఇతడు వసిష్ఠుడనే పేరుతో మూడు జన్మలెత్తాడు. అందులో మొదట బ్రహ్మ మనస్సునుండి జన్మించాడు. అప్పుడే ఇతడు అనేక వేదమంత్రాలను దర్శించాడు. ఇతని భార్య అరుంధతి. పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశమనే పంచమహాభూతాలు, వసువులు కలవాడు కాబట్టి ఇతడు వసిష్ఠుడైనాడు. అణిమాది సిద్ధుల చేత వసువులను వశపరచుకోవడం వల్ల ఇతనికీ పేరు వచ్చింది. దక్షయజ్ఞంలో దేవతలతో పాటు ఇతడు కూడ మరణించాడు. అప్పుడు అరుంధతి కూడ ఇతణ్ణే అనుసరించింది. వీరిరువురు నక్షత్రాలైనారు. వీరికి 1. చిత్రకేతువు, 2. పురోచిషుడు, 3. విరచుడు, 4. మిత్రుడు, 5. ఉల్బణుడు, 6. వసుభృద్యానుడు, 7. ద్యుమంతుడు అని ఏడుగురు కుమారులు కలిగారు. వీరంతా బ్రహ్మర్షులైనారు.

ఇతడు రెండవసారి బ్రహ్మదేవుని హోమాగ్నినుంచి జన్మించాడు. ఈ జన్మలో అరుంధతి 'అక్షమాల' అనే పేరుతో ఇతనికి భార్య అయింది. నిమిచక్రవర్తి శాపం చేత ఈ జన్మ అంతరించింది.

మూడవ జన్మలో మిత్రావరుణుల కుమారునిగ, అగస్త్యుని సోదరునిగ పుట్టాడు. ఈ జన్మలో నారదుని చెల్లెలైన అరుంధతి ఇతని భార్య. ఇతడు మొదటి జన్మలో వేదాలను దర్శించాడు. రెండు, మూడు జన్మలలో వసిష్ఠునికి సంబంధించిన అనేక కథలు పురాణాలలో వివరించబడినవి.

పుట్టుకతోనే . . . .

ఊర్వశి, మిత్రావరుణుల ప్రభావ ఫలితంగా వసిష్ఠుడు జన్మించాడు. సద్యస్సంజాతుడు గనుక అతనికి శైశవ, బాల్య, కౌమారాలనేవి లేవు. పుట్టుకతోనే జ్ఞాని అయిన వసిష్ఠుడు సరస్వతీ నదీతీరంలో వసిష్ఠశిల అనే ప్రదేశంలో నివసిస్తూ తపస్సు చేశాడు. విపాశా నదీతీరంలో కూడ అతడు తన జ్ఞానసంపదను పంచిపెడుతూ వుండేవాడు. కృష్ణశిల అనే ప్రాంతంలో నివాసం చేశాడు. క్రమంగా అతడు వేద దర్శనం చేశాడు. అగ్ని, వరుణుడు, ఇంద్రుడు, ఉషస్సు మొదలైన దేవతలను సాక్షాత్కరింపజేసుకున్నాడు. అగ్ని, వాయువు, ఆదిత్యుడు అనే మూడు ప్రకృతి శక్తులకు ఉషస్సుతో గల సంబంధాన్ని దర్శించాడు. ఆయాదేవతల స్తోత్రాలను వెలువరించాడు. అశక్వరీలనే సూక్తం ద్వారా ఇంద్రునకు బలం పెరిగేలా చేశాడు. దాని వలన ఇంద్రుడు వసిష్ఠుని యందు మిత్రత్వం వహించాడు. వసిష్ఠుని స్తోత్రాలు, పితరులకు కూడా తృప్తి కలిగించాయి. తీవ్రమైన తపస్సుతో అతడు క్రమ క్రమంగా ఎదిగి మహర్షి అయ్యాడు.

అగస్త్యుడు ఈయనకు అగ్రజుడు. అతడు తన చేతలతో లోకప్రజలకు సన్నిహితుడయ్యాడు. ఎల్లప్పుడూ తపోనిష్ఠలో వుండే వసిష్ఠుని యొక్క శక్తి సామర్థ్యాలను లోకోపకారకంగా తీర్చిదిద్దటానికి అగస్త్యుడు తన సోదరునికి తృత్సులు అనే జనులతో సంబంధాన్ని ఏర్పరచాడు. తన జ్ఞానతేజస్సుతో, తపోమహిమతో, లోకసంగ్రహణదీక్షతోను వసిష్ఠుడు కొద్దికాలంలోనే తృత్సులకు పురోహితుడుగా స్థిరపడి వారికి నాయకత్వం వహించాడు. అతని నాయకత్వంలో తృత్సులు సర్వతోముఖాభివృద్ధి సాధించారు.

**వసిష్ఠుని కుటుంబం :**

వసిష్ఠుడు కర్దమ ప్రజాపతి కుమార్తెయైన అరుంధతిని వివాహమాడాడు. అరుంధతి అనగా భర్తను ఎన్నడును విడువనిది, భర్తమాట జవదాటనిది. వీరి దాంపత్యం భారతజాతికి ఆదర్శప్రాయమై వెలుగొందుతూ ఉంది. ఈమె వల్ల వసిష్ఠుడు శక్తి అనే కుమారుని పొందాడు. ఇంకా అనేకులైన కుమారులు జన్మించారు. వాళ్ళుకూడ తపోనిష్ఠాగరిష్ఠులై జ్ఞానపరిపూర్ణులై వేదాన్ని దర్శించారు. వసిష్ఠుడు తన కుమారులతో కూడా అనేకములైన వేద భాగాలను, సామలను దర్శించాడు. వాటిని ప్రచారంచేశాడు. తన ప్రజాహితకార్యాల ద్వారా ప్రజాపురోహితుడుగా ప్రసిద్ధి చెందాడు. తృత్సులకు వసిష్ఠుని మాటే వేదం, వసిష్ఠుని బాటే అనుసరణీయం.

వసిష్ఠుని కుటుంబం కూడ అభివృద్ధి చెందింది. శక్తికి భార్య అయిన అదృశ్యంతికి పరాశరుడు జన్మించాడు. ఇతడు కూడా తన తపశ్శక్తితో వేద భాగాలను దర్శించాడు.

**విశిష్ట లక్షణాలు :**

వసిష్ఠునకు, వసిష్ఠుని కుటుంబానికి ఒక విశిష్టమైన గుర్తింపు ఉండేది. వారందరికి తలకు కుడిప్రక్కన కొప్పు ఉండేది. అందరూ కూడ తెల్లని వస్త్రాలు ధరించేవారు. వీరి దర్శనం అందరికి పవిత్రమైన ఆలోచనలను కలిగించేది. సూర్యసమాన తేజస్సు, వాయు సమాన వేగము వీరి విశిష్ట లక్షణాలు. వీరు చేసే ప్రసంగాలు కాని, దేవతాస్తోత్రాలు కాని ఇతరులకు అనుకరించటానికి అసాధ్యాలుగా ఉండేవి. వీరికి అతీంద్రియ జ్ఞానసంపద పుష్కలంగా ఉంది. సహస్రవముఖాలుగ విస్తరించే కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన హృదయజ్ఞానము వీరిసొత్తు.

**గణరాజ్యాలు : భరతగణం సుదాసు నాయకత్వం :**

ఆ కాలంలో భారతదేశంలో అనేక రాజగణాలు విభిన్న ప్రాంతాల్లో పరిపాలిస్తూ ఉండేవి. వానిలో భరతగణం ఒకటి. దానికి నాయకుడు సుదాసు. అతడు పైజవనుని కుమారుడు. మంచి పరాక్రమశాలి. భారతజాతికి చక్కని పరిపాలనను అందివ్వాలనే కోరిక కలవాడు. భారతదేశం యొక్క సమగ్రతను కాపాడుతూ, భారతజాతి యొక్క ఐకమత్యాన్ని పెంపొందింపజేయాలని సుదాసు ఆకాంక్ష. అయితే అతని ఆశలను వమ్ముచేస్తూ కొన్ని గణాలు దేశంలో. ఎల్లప్పుడు ఉపద్రవాల్ని కలిగిస్తూ వుండేవి. వానిలో అను, ద్రుహ్యు, పురు, తుర్వసు, యదు అనే ఆర్యగణాలు, పక్థులు, భళానులు, అలినులు, విషాణినులు, శివులు అనే అనార్యగణాలు లోకోపద్రవకరంగా పరిణమించినాయి. వీటిని అణచకుండా జాతిని కాపాడటం, దేశాన్ని రక్షించడం సాధ్యం కాదని సుదాసు గ్రహించాడు. అప్పటికే వసిష్ఠుని నేతృత్వంలో క్రమంగా బలపడుతున్న తృత్సులతో మైత్రిచేసి తద్వారా శత్రువులను ఎదుర్కోవాలని భావించాడు. తృత్సులకు రాయబారం పంపాడు.

**ఒకే ఒరలో . . . .**

ఆ కాలంలో భరతకులానికి ఒక పురోహితుడున్నాడు. అతడు విశ్వామిత్రుడు. విశ్వామిత్రుడు కూడా సామాన్యుడుకాడు. అసమానమైన శక్తి, పట్టుదల ఈతని సొత్తు. రాజుగా జనించి మహర్షియైన మహాతపః సంపన్నుడు. అతని పౌరోహిత్యంలో సుదాసు ఎన్నో ఘనవిజయాల్ని సాధించాడు. తృత్సుల నియమం కారణంగా, సుదాసు విశ్వామిత్రుని వదలుకొని తృత్సుల పురోహితుడైన వసిష్ఠుని తనకు కూడ పురోహితునిగా అంగీకరిస్తూ అతని నేతృత్వాన్ని అంగీకరింపవలసి

వచ్చింది. తృత్సులతో స్నేహం తన అభిలాష తీరడానికి అత్యంత ఆవశ్యకం. వసిష్ఠుని పురోహితునిగా తీసుకొనక తప్పదు. ఒక ఒరలో రెండు కత్తులు యిమడనట్లుగా ఒకగణానికి ఇద్దరు పురోహితులు, అందులోను అత్యంత ప్రతిభాసంపన్నులు ఉండటం సాధ్యం కాదు కదా! అందువల్ల సుదాసు విశ్వామిత్రుని వదలుకొన్నాడు.

వసిష్ఠుడు తృత్సులతో బాటు భరతగణాన్ని కూడ విజయపథంవైపు పయనింప జేశాడు. ఈ రెండు గణాలు దినదినాభివృద్ధి చెందుతూ బలపడసాగినాయి. అన్యగణాలపై ఆధిక్యం సంపాదించడానికి సర్వ విధాలా సన్నద్ధమై వున్నాయి. వసిష్ఠుడు ఈ రెండు గణాల యొక్క శక్తి సంపదలను సమీకరించే బృహత్ ప్రయత్నంలో వున్నాడు. వారికి దైవికబలాన్ని కూడ చేకూర్చే యత్నంలో మునిగి వున్నాడు.

**సాగరంలా ఉప్పొంగింది :**

భరతకులం పౌరోహిత్యం పోయినందువల్ల అవమానపీడితుడైన విశ్వామిత్రుడు ప్రతీకారవాంఛతో మండిపోయాడు. అప్పటికే లోకోపద్రవ కారకులుగా ముద్రపడిన గణాలను ఆశ్రయించి వారిని యింకా ప్రేరేపించాడు. వారినందరనూ సమైక్యపరచాడు. వారికి యుద్ధనీతిని బోధించాడు. భరతులపై పురికొల్పాడు. వసిష్ఠుని నేతృత్వంలో తన గణములను అభివృద్ధి పరచుకొంటున్న సుదాసుపై ఈ రాజ గణాలు తుర్వసుల నేతృత్వంలో యుద్ధం ప్రకటించాయి. సుదాసు యింకా యుద్ధానికి సన్నద్ధుడు కాలేదు. అభివృద్ధిమార్గంలో పయనిస్తున్న తృత్సులకు యుద్ధమంటే ప్రీతికాదు. కాని మార్గాంతరం లేదు. అపారమైన సైన్యంతో పదిమంది రాజుల కూటమి వెల్లువగా ముట్టడికి సిద్ధమౌతోంది. పరుష్ణీనదికీ, యమునానదికి మధ్య సైన్యాలు మోహరించి వున్నాయి.

సుదాసునాయకత్వంలో సైన్యాలు ఎంత ప్రయత్నించినా ముందుకు పోలేక పోవటమే కాక వెనకడుగు వేయక తప్పలేదు. ఆవిధంగా సుదాసుసైన్యాలు పరుష్ణీనదీతీరం చేరుకున్నాయి. పరుష్ణీనదిని దాటి ఆవలి ఒడ్డుకు చేరుకుంటే సైన్యానికి కొంత విశ్రాంతి లభిస్తుంది. ఆత్మబలం సంపాదించటానికి అవకాశం ఏర్పడుతుంది. కాని, పరుష్ణీనదిని దాటటమెలా? నది పరవళ్ళు తొక్కుతోంది. నదిలో దిగితే ప్రవాహవేగానికి కొట్టుకుపోవడం ఖాయం. అది ఆత్మ వినాశకారణం. పోనీ తీరంలోనే వుంటే సాగరంలా ఉప్పొంగుతున్న శత్రుసైన్యాల పొంగునకు గురికాక తప్పదు. రెండూ ప్రమాదకరములే. ఏమి చేయాలో పాలుపోని స్థితిలో సుదాసు, అతని సైన్యాలు ఆవులను తోలే కట్టులాగా రక్షణ లేకుండా బిక్కచచ్చి వున్నాయి.

**ఎంతో సమయం అక్కరలేదు :**

ఆ సమయంలో వసిష్ఠుడు తన యొక్క దర్శనసామర్థ్యంతో ఉపాయం కనుగొన్నాడు. తన అద్భుతమైన వాక్చాతుర్యంతో అతీంద్రియమైన, ఆత్మనిష్ఠమైన శక్తితో ఏకాగ్రంగా ఇంద్రుని ప్రార్థించాడు. ఈ ప్రార్థనలను ఇంద్రుడు విన్నాడు. వసిష్ఠుని అభీష్టాన్ని నెరవేర్చాడు. పరుష్ణి యొక్క ప్రభూతప్రవాహాన్ని ఖాళీ చేయించాడు. పరుష్ణీ నదియొక్క ప్రవాహవేగం తగ్గింది. నీరు ప్రశాంతంగా ప్రవహిస్తోంది. వసిష్ఠుని నాయకత్వంలో సుదాసు, సుదాసుని సైన్యాలు పరుష్ణీనదిని అవలీలగా దాటివేశాయి. సుదాసు ఊపిరి పీల్చుకున్నాడు. ఈ అద్భుతమైన పరిణామం సుదాసు సైన్యాలకు కొత్త ఊపిరి నిచ్చింది. అవి నూతన బలాన్ని సంతరించు కున్నాయి. శత్రువునెదుర్కొనేందుకు సర్వ సన్నద్ధమయ్యాయి.

శత్రుసైన్యాలు పురోగమిస్తూ వస్తూవున్నాయి. వానికి ఎదురు లేకుండా ఉంది. తమ సైన్యం అపారం. సుదాసు సైన్యం పరిమితం. వారిని ఓడించడానికి యింక ఎంతో సమయం అక్కరలేదు అనుకుంటూ శత్రుసైన్యాలు ఉరుకుతున్నాయి.

తుర్వసుడు అప్పుడే భరతుల ఆస్తులలో తన భాగాన్ని గురించి ఆలోచనలో పడ్డాడు. యుద్ధంలో గెలిచిన తర్వాత ఓడిపోయినవారి ఆస్తులలో అధికభాగం తమకే దక్కాలని మత్స్యులు ప్రచారం చేసుకుంటున్నారు.

**విజయదుందుభి :**

సుదాసుసైన్యం పరుష్ణీనదిలో దిగటం, చాలా సులభంగా దానిని దాటివేయడం కనులారా చూచిన శత్రుసైన్యాలు తాముకూడా నదిని దాటటానికి నదిలో దిగినాయి. ఒక్క సారిగా వెల్లువ పెల్లుబికింది. పరుష్ణీనది వెనుకటివలెనే మహోగ్రరూపాన్ని దాల్చింది. ప్రవాహవేగానికి సైన్యాలు కొట్టుకు పోయినాయి. కాపలా కాచే గొల్లవాడు లేని ఆవులు పారిపోయినట్లుగా సైనికులు చెల్లాచెదరయినాయి. ఆవిధంగా నదిలో కొట్టుకుపోతున్న శత్రు సైనికులు రక్షకుని కోసం దేన్నిబడితే దాన్ని ఆశ్రయించారు. తమతో బాటు కొట్టుకు పోతున్న మరియొకని ఆసరా కోసం ఉవ్విళ్ళూరారు. కొందరు సైనికులు ప్రవాహపు వేగాన్ని తట్టుకుని ఈది ఒడ్డుకు చేరారు. ఆ విధంగా ఒడ్డుకు చేరిన వారిని సుదాసు సైన్యాలు తుదముట్టించినాయి. యజ్ఞం కోసం పురోహితుడు దర్భలను కోసినంత సులభంగా సుదాసు శత్రుసైనికుల తలలనుత్తరించాడు. ఈ యుద్ధ యజ్ఞానికి యజమానుడైన తుర్వసుడు స్వయంగా పురోడాశం

అయ్యాడు. భరతకులం యొక్క సంపదంతా తనకు లభిస్తుందని ఆశపడిన మత్స్యులు నశించారు. భృగువులు ద్రుహ్యులు కూడ వారిని అనుసరించారు. వారి కోటలన్నీ సులభంగా సుదాసుకు వశమైనాయి.

ఈ వృత్తాంతం దాశరాజ్ఞ యుద్ధంగా ఋగ్వేదంలో ప్రసిద్ధమైయుంది. ఈ యుద్ధంలో సుదాసు విజయానికి, భరతకుల ప్రతిష్ఠకు భావి బారత దేశ సంస్థాపనకు వశిష్ఠుని పాత్ర అసాధారణమైనది. ఇంద్రునితో వసిష్ఠునకుగల మైత్రికారణంగానే ఈ యుద్ధంలో విజయం లభించింది. ఇక్కడ నిజానికి విజయం ఇంద్రునిదే. ఇంద్రుడు మేకల సాయంతో సింహాన్ని జయించాడు. ఈ యుద్ధ విజయంతో వసిష్ఠుని కీర్తి దిగంతాలకు వ్యాపించింది.

**పురోహితుడుగా . . . .**

ఆ తర్వాత కూడ సుదాసు, అతని వర్గంవారు ఇంటా, బయటా ఉన్న శత్రువులతో యుద్ధాలు చేయవలసి వస్తూ ఉండేది. దేనికైనా వెనుతీయుని శత్రువుల అనాగరిక ప్రవర్తన వలన నాగరికులుగ, శాంతికాముకులుగ పురోభివృద్ధి సాధిస్తున్న భరతగణాలకు చాల బాధ కలిగేది. ఈ పీడను వదలించుకోవటానికి వసిష్ఠుడు దేవతలను ప్రార్థించాడు. ముఖ్యంగా యుద్ధదేవుడైన ఇంద్రుని, ఋతప్రతినిధియైన వరుణుని ప్రార్థించాడు - ఓ ఇంద్రావరుణులారా! మా శత్రువులు మరీ కక్ష కట్టియున్నారు. వారి ఆయుధాలు మమ్మల్ని క్షోభ పెడుతున్నాయి. మా ఇహ పరాలను కాపాడేవారు మీరే కదా ! అన్ని యుద్ధాలలోనూ మమ్ము కాపాడండి. రాజ్యక్షేమంకోసం, ప్రజల సంపత్సమృద్ధికోసం, శాంతి సౌఖ్యాలకోసం వసిష్ఠుడెంతగానో శ్రమించాడు. తన తపోనిష్ఠను, దేవతలతో తనకు లభించిన స్నేహాన్ని ప్రజలకోసం వినియోగించాడు.

అభీవర్తమనీసూక్తం ద్వారా బ్రహ్మణస్పతిని స్తోత్రం చేసి రాష్ట్రాభివృద్ధిని, శత్రుక్షయాన్ని సంపాదించిపెట్టాడు. అగ్నిని ప్రార్థించి అనేకమైన ఆశీస్సులను ప్రజలకు పంచిపెట్టాడు. మండూకసూక్తం ద్వారా అవగ్రహమేర్పడినప్పుడు మేఘాలను ప్రేరేపించి వర్షం కురిసేట్లు చేశాడు. వసిష్ఠుని పౌరోహిత్యంలో భరత-తృత్సుగణాల ఆధిపత్యంలో భారతదేశం అసమానమైన అభివృద్ధిని సాధించింది.

**నేనే నిజమైన వసిష్ఠుణ్ణి!**

ఎంత ఎంతగా లబ్ధ ప్రతిష్ఠులు కీర్తిమంతులౌతారో అంతంతగా శత్రువులు కూడ పెరుగుతూ వుంటారు వసిష్ఠునకు కూడ ఈ గతి తప్పలేదు. విశ్వామిత్రుడు వుండనే వున్నాడు. సుదాసుని వద్ద తన పౌరోహిత్యం పోవడానికి వసిష్ఠుడే కారణమనే భ్రమతో అతని పై కక్ష కట్టాడు. కొంతమంది యాతుధానులనే రాక్షసులు విశ్వామిత్రుని ప్రేరణ వలన వసిష్ఠుని పుత్రులకు అనేక విధాల కీడు చేశారు. ఒక రాక్షసుడు వసిష్ఠుని రూపం ధరించి లోకంలో అల్లకల్లోలం సృష్టించి వసిష్ఠునకు మచ్చ తేవాలని ప్రయత్నించాడు. 'నేనే నిజమైన వసిష్ఠుడను. అతడు రాక్షసుడు' అని ప్రచారం చేశాడు. వసిష్ఠుడు తన మిత్రుడైన ఇంద్రుని ప్రార్థించాడు. మరుత్తులను కూడ అతడు స్తోత్రం చేశాడు. ఈ సందర్భంలో అతడిట్లా శపథం చేశాడు -

'నేనెవరినైనా ఒక్క మనిషిని గాని ఇబ్బంది పెట్టినట్లయితే, నేను గనక రాక్షసుడనైనట్లయితే నేనీ క్షణమే మరణిస్తాను. ఈ రకంగా నన్ను యాతుధానుడని అబద్ధముగా పిలచినవాడు తన 10 మంది పిల్లలతోను నశిస్తాడు'. ఈ సందర్భంగా వసిష్ఠుడు రక్షోఘ్న సూక్తాన్ని దర్శించాడు. రక్షోఘ్న సూక్త పఠనం వలన రాక్షసాది దుష్ట శక్తుల బారి పడకుండా తప్పించు కోవచ్చుననేది మన సంప్రదాయం.

## మార్గాంతరం లేదు !

సరస్వతీనదిలో స్నానము చేసి సంధ్యాదికాలు నిర్వర్తించుకోవడం వసిష్ఠునకు నిత్యకృత్యంగా వుండేది. వసిష్ఠుని ప్రవాహవేగంలో లాగుకొని రావలసినదిగా విశ్వామిత్రుడు సరస్వతీనది నాజ్ఞాపించాడు. ఋషి ఆజ్ఞ జవదాటరానిది. వసిష్ఠునకు కీడు కలగడం సరస్వతీ నదికి ఏమాత్రం ఇష్టంకాదు. నిజానికి వసిష్ఠుడు సరస్వతీ పుత్రుడుగా సరస్వతీ తీరంలో పెరిగాడు. మహర్షులందరిలో విశిష్టతను సంపాదించాడు. మహర్షులెవరికి ఇంద్రునితో ముఖాముఖి మాట్లాడే అవకాశం లేని కాలంలో వసిష్ఠునిపై ఇంద్రునకు విశిష్టమైన అనురాగం కలిగింది. మిగిలిన దేవతలందరకూ కూడ అతడు ప్రేమ పాత్రుడే. పై పెచ్చు ప్రజాహిత కార్యాలలో అందరికన్నా ముందుంటూ ప్రజాపురోహితునిగ వన్నెకెక్కినవాడు. అటువంటివానిని శత్రువులబారిన పడవేయటమా? సరస్వతీనదికి ఇష్టమే లేదు. కాని, మార్గాంతరం లేదు. ఋషి ఆజ్ఞ అలావుంది. అయితే సరస్వతీనది ఉపాయం కనుగొంది.

## నదిలో కొట్టుకు పోయాడు :

వసిష్ఠుడు యథాప్రకారంగా బ్రాహ్మముహూర్తంలో స్నానాదికాలు నిర్వర్తించడానికి సరస్వతీ నదిలో దిగాడు. తనివి తీరా స్నానమాడి సూర్యభగవానునకు అర్ఘ్యప్రదానం కావించి నడుములోతు నీళ్ళలో నిలబడి మంత్ర జపం చేస్తున్నాడు. సరస్వతీనదీప్రవాహం ఒక్కసారి అధికమైంది. ఆ వేగానికి ధ్యానమగ్నుడైన వసిష్ఠుడు నీళ్ళల్లో పడి కొట్టుకొని పోసాగాడు. ప్రవాహవేగం ఎంత ఎక్కువగా వుంది అంటే వసిష్ఠునకు తనకేమి జరుగుతోందో కూడా తెలియనటు వంటి మానసికస్థితిలో పడేసింది. ఇంకా పూర్తిగా చీకట్లు తొలగి పోలేదు. కనుక

ఏదైన ఆసరా దొరుకుతుందేమో చూద్దామను కొంటే ఏమీ కనబడలేదు. వసిష్ఠుడు నిర్విణ్ణుడై వున్నాడు.

సరస్వతీ నదికి ఆవల కొంత దూరంలో విశ్వామిత్రుని మనుష్యులు పొంచి వున్నారు. నదిలో కొట్టుకు వస్తున్న వసిష్ఠుని పట్టి బయటకు లాగి అంతం చేయాలని వారి ప్రయత్నం. అల్లంత దూరంలో నదిలో కొట్టుకొని వస్తున్న మానవాకారం వారికి గోచరించింది. వారు తమ పనికి సిద్ధమైనారు.

## నీలో రక్తం ప్రవహిస్తుంది !

ఇక్కడే సరస్వతీనది ఒక చక్కని ఉపాయం చేసింది. శత్రువులు పొంచి వున్న ప్రాంతాన్ని సమీపించడానికి ముందు ప్రవాహవేగాన్ని చాలా ఉద్ధృతం చేసింది. ప్రవాహవేగం తమకు అనుకూలంగా వుందని, వసిష్ఠుని తాము పట్టుకోవచ్చుని నదిలోనికి దిగిన వసిష్ఠుని శత్రువులు అనుకోకుండా ఉద్ధృతంగా పెరిగిన ప్రవాహ వేగాన్ని చూచి భయపడి తీరం వైపు పారిపోయారు. వసిష్ఠుడు వారి బారిన పడకుండా సరస్వతీనదీప్రవాహం అతనిని చాలా దూరం తీసుకొని పోయి సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. తన ఆజ్ఞను ధిక్కరించిన సరస్వతీనదిపై విశ్వామిత్రుడు కోపించి ఇకపై నీలో సంవత్సరం పాటు రక్తం ప్రవహిస్తుంది అని శపించాడు. అప్పటి నుండి సరస్వతీ నదిలో ఒక భాగం అరుణానదిగా ప్రసిద్ధమైంది.

## వాళ్ళ తలలు తెగిపడాలి !

ఈ విధంగా వసిష్ఠుని అభివృద్ధిపై అసూయపొందిన వారు అతనికి, అతని కుటుంబసభ్యులకు అనేకవిధముల ద్రోహము చేయడానికి ప్రయత్నంచేశారు. వీరందరినుండి తననూ, తన కుటుంబీకులను

రక్షించుకొనేందుకు వసిష్ఠుడు ఇంద్రసోములను అనేకవిధముల ప్రార్థించాడు. ''ఎవరు అబద్ధపు ఆరోపణలతో పవిత్రమైన బుద్ధికల నాకు ద్రోహం చేయాలని తలపెడతాడో, అటువంటి అబద్ధాలకోరును పిడికిలిలో బిగించిన నీటినివలే నశింపజేయుము'' అని ఇంద్రుని ప్రార్థిస్తాడు. ''నన్నెవరైతే అబద్ధపు నిందలతో యిబ్బందులకు గురి చేస్తారో, నాలోనున్న మంచిని నీచాతి నీచంగా దుర్మార్గంగా చిత్రిస్తారో, అట్టివారిని పాములకు ఆహారంగా చేయి, లేదా నిర్ఋతి యొక్క ఒడిలో భస్మంచేయి'' అంటూ తనకు కీడు చేయుటానికి ప్రయత్నించే శత్రువులను అణచివేయమని పదే పదే వసిష్ఠుడు ఇంద్రాది దేవతలను వేడుకొన్నాడు. ఇది తనకు మాత్రమే గాక లోకానికి కూడ రక్షణ, అని ఆయన భావించాడు. ''చిన్న, పెద్ద గబ్బిలాలరూపంలో వుండేటటువంటి; కుక్కగా, తోడేలుగా, గ్రద్దగా, డేగగా ఉండేటటువంటి దుష్టశక్తిని ఎక్కడ వున్నా నాశనంచేయి. ఓ ఇంద్రా! నీ వజ్రాయుధంతో పెద్దరాతితో వలె ఆరాక్షసులను పిండిచేయి.''

''ఓ ఇంద్రా! మగకాని, ఆడకాని మోసంతో సమాజానికి ఉపద్రవం కలిగించే ఆ దుష్టశక్తిని అణచివేయుము. ఈ రక్తపిపాసులైన రాక్షసులు మరల తమ తలలు చెక్కివేయబడగా నశించిపోవాలి. మరల సూర్యోదయాన్ని వీళ్ళు చూడకూడదు'' అంటూ వశిష్ఠుడు ఎల్లవేళలా ఇంద్రుడు, వరుణుడు, సోముడు, మరుత్తులు మున్నగు దేవతలను ప్రార్థిస్తూ ఉండేవాడు.

**పుత్రశోకం తప్పలేదు !**

ఈ విధంగా శత్రువులు వసిష్ఠునకు అనేకవిధాల అపకారం చేస్తూఉంటే వీరందరినుండి తనను, తన కుటుంబాన్ని

రక్షించుకొనుటకు వసిష్ఠుడు అనేకవిధాల తంటాలు పడుతూండేవాడు. అయినా కూడ పాపమతనికి పుత్రశోకం తప్పలేదు. యాతుధానులు అనే రాక్షసులు, కొంతమంది స్వవర్గీయులు అసూయాద్వేషాలతో వసిష్ఠుని కుమారులను చంపివేశారు. క్రమక్రమంగా వసిష్ఠుని కుటుంబం తగ్గిపోతూ వచ్చింది.

**దావానలంలో విసిరివేశారు :**

శత్రువు కన్ను వసిష్ఠ పుత్రుడు శక్తిపై బడింది. శత్రువుని శత్రువుగా ఎదుర్కోవడం కంటే మిత్రరూపంగా పరిణమించి ఎదుర్కోవడం సులభమని కూటనీతిని అనుసరించాడు. వసిష్ఠపుత్రుడైన శక్తితో స్నేహం నటిస్తూ మెల్ల మెల్లగా సుదాసుకు సన్నిహితుడయ్యాడు. సుదాసు కుమారులలో వసిష్ఠుని యెడల వైమనస్యం రగుల్కొలిపాడు. దానికి తోడు సుదాసు చేస్తున్న యజ్ఞంలో ఋత్విక్కు గావున్న విశ్వామిత్రుని పొరబాటును శక్తి వేలెత్తి చూపడం జరిగింది. దానితో విశ్వామిత్రునిలో అసూయాద్వేషాలు మిన్నుముట్టాయి. ప్రత్యక్షంగా వసిష్ఠుని గాని, వసిష్ఠ పుత్రుని గాని ఎదుర్కోలేక స్నేహం నటించి పగదీర్చుకోవాలని పన్నాగం పన్నాడు. 'ససర్పరీ' అనే విద్య సహాయంతో అతడు శక్తిని తన దగ్గరకు ఆకర్షించాడు. సుదాసుపుత్రులను ప్రేరేపించాడు. వారు విశ్వామిత్రుని ప్రభావానికి లోనై శక్తిని దావానలంలో విసరివేశారు.

శక్తి మరణం వసిష్ఠుని క్రుంగదీసింది. ఆత్మహత్య చేసుకోవాలని కాళ్ళకు, చేతులకు బంధాలు బిగించుకుని వసిష్ఠుడు విపాశానదిలో దూకాడు. విపాశానది కూడ వసిష్ఠునకు మాతృ సమానమైనది. ఆ నది వసిష్ఠుని దురవస్థను గ్రహించినదై, అతని బంధనములను విడిపించింది. విపాశ అనగా పాశములను పోగొట్టునది అని సార్థక నామధేయురాలైంది.

**స్వర్గద్వారాలు తెరచుకొన్నాయి :**

నిర్వేదంతో వసిష్ఠుడు దేశాలు పట్టిపోయాడు. ఈ సమయంలో అతడు అనేక సామలను దర్శించాడు. రథంతరసామ, వసిష్ఠస్య ప్రియం, నివహ అనేటటువంటి సామలను వెలువరించాడు. ధాతా, సవిత, విష్ణువు అనే దేవతలనారాధించి వసిష్ఠుడు రథంతరసామమును సంపాదించాడు. సంపూర్ణమైన, ఏకాగ్రమైన విశ్వాసంతో రథంతరసామను పఠించిన వసిష్ఠునకు స్వర్గ ద్వారాలు తెరచుకొన్నాయి. వసిష్ఠస్యప్రియం అనే సామద్వారా వసిష్ఠుడు ఇంద్రుని అభిమానాన్ని మరింతగా చూరగొన్నాడు. నివహ అనే సామను కనుగొన్న సమయంలో ఇంద్రుడతనితో యిలా అన్నాడు, ''వసిష్ఠా నేను నీకొక బ్రాహ్మణమును వెల్లడిచేస్తాను. దీన్ని అవగతం చేసుకున్న నీ యొక్క పౌరోహిత్యంలో భరతులు అభివృద్ధి చెందుతారు. అయితే దీనిని మరెవరికి తెలియనీయరాదు'' అని. ఈ సామద్వారా ఇంద్రుని విశిష్టమైన ఆదరాన్ని సంపాదించి తమ గాఢ మైత్రిని వశిష్ఠుడు లోకానికి చూపించాడు.

**గాఢంగా నిద్రపో !**

ఈ విధంగా తిరుగుతూ, తిరుగుతూ, వేదాన్ని దర్శిస్తూ లోకోపకారాన్ని నిర్వహిస్తూ వున్న వసిష్ఠునకు ఒక పర్యాయం ఒక సంకటస్థితి ఏర్పడింది. మూడు, నాలుగు రోజులపాటు అతనికి అన్నపానీయాలు దొరకలేదు. ఆకలితో అలమటించిపోయిన వసిష్ఠుడు, ఒక యింటిలో దొంగతనానికి సిద్ధపడ్డాడు. అదొక పెద్ద భవంతి. అది వరుణుని భవంతి. దానికి కాపలాగా జాతికుక్క పహారా కాస్తూవుంది. భవంతిలో కూడ జనులు మేల్కొని వున్నట్లుగా అలికిడౌతోంది. వసిష్ఠునకు ఆకలి అణచుకోలేనంతగా వుంది. తెగించి భవంతిలో ప్రవేశించాడు. కుక్క అతనిపై దాడి చేసింది. ఆ కుక్కను ఉద్దేశించి

వసిష్ఠుడిలా అన్నాడు, ''ఓ చారల కుక్కా! అరవటానికి నీవు నోరు తెరచినపుడు ప్రకాశిస్తున్న ఆయుధాలవంటి ఒక వెలుగు కలుగుతోంది. నీకోరలద్వారా కనబడే నీ పళ్ళే ఆయుధాలు.

అరవటం మాని గాఢంగా నిద్రపో. లేకపోతే ఓ దొంగనో, దోపిడీదారునో వెంబడించు. ఇంద్రుని ప్రశంసించే మమ్మల్ని ఎందుకు తొందర చేస్తావు!''

''నీవొకపందిని నిలువుగా చీల్చవచ్చు. ఆపందికూడ నిన్ను చీల్చి ప్రతీకారం తీర్చుకోవచ్చు. ఇంద్రుని స్తోత్రంచేసే మమ్మల్ని ఎందుకు తొందర పెడతావు!''

## ప్రశ్వాపనీ ఉపనిషత్తు :

ఈ విధంగా పలుకుతూ వసిష్ఠుడు ఒక మంత్రాన్ని మెల్లగా ఉచ్చరించాడు. ''తల్లి నిద్రించుగాక! తండ్రి నిద్రించుగాక! కుక్క నిద్రించుగాక! గృహయజమాని కూడ అట్లే సుఖముగా నిద్రించుగాక! బంధువులందరూ నిద్రింతురుగాక! అలాగే చుట్టూ వున్న జనులు నిద్రింతురుగాక! ఎవరైనా గాని కూర్చొని వున్నా, కదులుతూ వున్నా, మమ్మల్ని చూచినా వారందరి కళ్ళను మేము మూసివేస్తాము. వారిని ఈ ప్రాసాదం మాదిరిగా నిశ్చలంగా వుండేట్లు చేస్తాము. సర్వవరప్రదాతయైన సూర్యుడు వేయి కిరణాలతో దూరముగా నున్న ఆ సముద్రము యొక్క మధ్యనుండి ఉదయిస్తూ ఉంటాడు కదా! ఆయన కృపాకలిత సహాయంతో మీయందరను నిద్రలోనికి పంపుతాము. లోగిలిలో పడుకొనే వారుగాని, వాహనాలలో పడుకొనేవారు గాని, లేదా పరుపులపై పడుకొనే మంగళకరమైన సువాసనలు గలస్త్రీలు గాని, అందరినీ గాఢ నిద్రలోనికి పంపుతాము''. ఈ సామమును ''ప్రశ్వాపనీ ఉపనిషత్'' అని

వ్యవహరిస్తారు. దీన్ని పఠించడం ద్వారా అందరనూ నిద్రాముద్రితులను చేయవచ్చు. వసిష్ఠుని సూక్తాలలో యిటువంటి వాటిని గమనించినపుడు వసిష్ఠుడు ఎంతటి చిక్కుల్లో పడ్డాడో, విచిత్రమైన, సమాధానము లేని సందర్భాలెన్ని అతనికి తారసిల్లినాయో స్పష్టంగా తెలుస్తుంది.

**శోకమే శ్లోకమవుతుంది :**

ఈ విధంగా తిరిగే సందర్భంలో వసిష్ఠుడు మహోన్నతమైన మంత్రాలనే గాక, కొన్ని సందర్భాలలో క్షుద్రమైన, క్షణిక ప్రయోజనం గల మంత్రాలను కూడ ప్రయోగించినట్లు కనబడుతోంది. వసిష్ఠుని అంతవానికి క్షుద్రమంత్ర ప్రయోగం మంచిదేనా? జీవన్మరణ సమస్య యేర్పడినప్పుడు యిలాంటి చర్చకు అవకాశం లేదు. ముందు జీవించి ఉంటే కదా! మహోన్నతకార్యాలు చేయడం. అయినా, తప్పు తప్పే. దానికి ఫలితమనుభవించక తప్పదు. అసూయాగ్రస్తులైన శత్రువులవల్ల కొంత, స్వయంకృతాపరాధంవల్ల కొంత అతని జీవితంలో యెన్నో ఒడిదుడుకులు ఏర్పడ్డాయి.

దుఃఖ సముద్రంలో పడి కొట్టుకు పోతున్నాడు. ఉద్వేగపూర్ణము, సంఘర్షణామయము అయిన ఆ మానసికావస్థలోని వశిష్ఠుడు మహత్తరమైన వేదభాగాలను, సామలను దర్శించటం జరిగింది. విజ్ఞానం పరిపూర్ణ దశకు చేరాలంటే విజ్ఞానికి సంఘర్షణ అత్యవసరం. మహానుభావుల శోకమే శ్లోకమవుతుంది. నిప్పులో కాచి తేనే బంగారం వన్నె బయటపడుతుంది.

**వరుణుడు నీపై కోపించాడు :**

ఒకసారి వశిష్ఠుడు సముద్రంలో ప్రయాణిస్తూ ఉన్నాడు.

సముద్ర మధ్యంలో నావ భగ్నం కాగా అతడు సముద్ర జలాల్లో చిక్కుబడి పోయాడు. దిక్కుతోచని స్థితి. బయటపడే శక్తి లేక, విలవిల్లాడాడు. ''దప్పిక నన్ను ఆవహించింది. నేను నీ పూజకుడను. నీటి నడుమ ఉన్నాను. నాకు సుఖాన్ని ఇమ్ము. ఓ! సంపదల దేవతా! నాకు ఆనందాన్ని ఇమ్ము'' అంటూ ప్రార్థించాడు. వరుణుడు తన తండ్రి, తనకు సహాయంగా వస్తాడని ఆశించాడు. వరుణుడు ఋతాన్ని అనగా సృష్టిక్రమంలో వుండే పద్ధతిని రక్షించేవాడు. దానికి విరుద్ధంగా ఆచరించేవారియెడల అతడు అనుకూలుడు కాడు. కాబట్టి క్షుద్ర విద్యలను ప్రయోగిస్తున్న వసిష్ఠునిపై అతనికి ఒక విధంగా వైమనస్యం కలిగింది. ఈ విషయం ఋషులందరకూ తెలుసు. వారు వసిష్ఠునకు తెలియజెప్పారు. వసిష్ఠుడు పశ్చాత్తాపపడి తాను తప్పుచేసినట్లు ఒప్పుకొంటూ తన తప్పులను కాయుమని, కరుణ చూపుమని వరుణుని ప్రార్థించాడు. ఈ సందర్భంగా అతని పరిదేవనం ఈ విధంగా వుంది.

''ఈ నా పరిస్థితిని నా ఆత్మకు చెప్పుకోనా! వరుణుని దగ్గరకు ఎలా వెళ్ళగలను?. అతడు నా కానుకను స్వీకరించునా? నిశ్చలమైన బుద్ధితో నేనెప్పుడు శాంతించిన అతనిని చూడగలను. ఓ వరుణ దేవా! నా తప్పు ఏమిటి? నాకు తెలియజెప్పు. బుద్ధిమంతుల నడిగాను. వారందరూ ఒకే మాట చెప్పారు. 'వరుణుడు నీపై కోపించాడు', అని''.

వరుణ ప్రార్థన :

''వరుణుని కోపానికి కారణమైన ఆ తప్పు పాతకాలంనాటిదా! ఓ! వరుణదేవా! నిన్ను ఎల్లప్పుడు పొగడుతూ వుండే నీ పాతమిత్రుని నాశనం చేయాలనుకొంటున్నావా! నీకెదురేమి! నీ దయ వుంటే పాపము నుండి విముక్తుడనై నేను నీవైపునకు త్వరితముగా మరలగలను''.

''మా తండ్రుల పాపమునుండి మమ్ములను విముక్తులను చేయి. ఈ మా శరీరాలతో మేము చేసిన తప్పులనుండి కూడ విముక్తులను చేయి. ఓ రాజా! అపహరింపబడిన పశువుల మాంసంతో విందులు కుడుస్తున్న దొంగనులాగా ఈ వసిష్ఠుని వదలిపెట్టుము. దూడను కట్టు వదలినట్లుగా ఈ వసిష్ఠుని విముక్తిని చేయి.''

''ఓ వరుణదేవా! యిది మేము స్వయముగా చేసినది కాదు. అది మా అవసరము. మత్తు కొలిపే కరువు, దాహము, జూదము, ఆలోచనా రాహిత్యము, యివి అన్ని మమ్ములను తప్పుదోవ పట్టిస్తూవున్నాయి. చిన్న వాళ్ళను కాపాడవలసిన పెద్దవాళ్ళుకూడా తప్పుదోవ పట్టిస్తూవున్నారు. నిద్రకూడ అధర్మాన్నే కల్గిస్తోంది''.

''ఓ వరుణదేవా! ఈ నాపాట నీ హృదయంలో గాఢంగా హత్తుకొనుగాక! యోగక్షేమాలను పొందుపరచుకొంటూ మేము అభివృద్ధి చెందెదముగాక! మీ ఆశీస్సులు మమ్మ సదా కాపాడుగాక!''

ఈ ప్రార్థనలో వసిష్ఠుడు పశ్చాత్తాప పడుతున్నట్లుగా స్పష్టమవుతూ ఉన్నది. తన తప్పుల నన్నింటిని క్షమింపుమని ప్రార్థించడం కన్పిస్తోంది. ఇది ఒక అపరాధ క్షమాపణ స్తోత్రంగా విశిష్టంగా కన్పిస్తోంది. దీనిలో దేవుని యెడల జీవుని భక్తి భావం గోచరమౌతూవుంది. భక్తిసిద్ధాంతానికి యిక్కడే విత్తనాలు చల్లబడినాయి అని విమర్శకుల అభిప్రాయం. తప్పు చేయటం మానవ నైజం. పశ్చాత్తప్తుడైన భక్తుని తప్పులు కాయటం భగవంతుని వైశిష్ట్యం. ఈ సూక్తాన్ని ప్రతిరోజూ పారాయణం చేసినట్లయితే తప్పు చేయటం నుండి నుండి తనను తాను మరల్చుకొనే శక్తి యేర్పడుతుంది అని మన విశ్వాసం.

**పితృప్రేమను కురిపించాడు :**

ఈ విధంగా ప్రార్థించిన వసిష్ఠుని వరుణుడు కరుణించాడు. నట్టేట్లో మునిగినట్లున్న వసిష్ఠుని తన పడవలో ఎక్కించుకున్నాడు. అతనిని తన ఒడిలోనికి తీసుకున్నాడు. కరుణామయుమైన అనుభూతులతో యింకా గొప్పపనులు చేయగల సమర్థునిగా తయారుచేశాడు. ఆ పడవపై యింకా ఎంతోకాలం ఆనందంగా గడపడానికి అవకాశం కల్పించాడు. చివరకు తన అస్తిత్వమునకుచెందిన పరమరహస్యాలను వసిష్ఠునకు ఉపదేశించాడు. ఆ విధముగా వరుణుడు తన కుమారునిపై పితృప్రేమను కురిపించాడు. పితృరక్షణను కల్పించాడు. తన్మయత్వంతో, కృతజ్ఞతాభావంతో, ఆరాధనా భావంతో వసిష్ఠుడు యిట్లా అన్నాడు.

''గోవు ( భాష) కు గల ఏడు పేర్లకు మూడు రెట్లైనతెలివితేటలు గల నాకు వరుణుడు పరవిశ్వము యొక్క రహస్యములను బోధించాడు. నేను ఆయనకు ప్రియ శిష్యుడను.''

వరుణుని బోధనలు పొందిన వసిష్ఠుడు ఆత్మస్థైర్యాన్ని పొందాడు. నిర్వేదం తొలగి పోయింది. మానసికవైక్లబ్యం మాసిపోయింది. ధర్మనిష్ఠ దృఢమైంది. యథా పూర్వ స్థితిని పొంది వసిష్ఠుడు స్వనివాసానికి తిరిగి వచ్చాడు. తన కోడళ్ళ జీవితాలను చక్కబరచటం తన ధర్మంగా గుర్తించాడు.

మనుమడు పరాశరుడు వేద ద్రష్ట. తండ్రియైన శక్తిని చంపినవారిపై పగబూని వారి అంతు చూస్తానని శపథం చేశాడు. వసిష్ఠుడు అతనిని శాంత పరచి పగ ప్రతీకారాల కంటే శాంతి సహనాలే సుఖ సంతోషాలను ఇస్తాయని చాటి చెప్పాడు.

**సోమయాగం రహస్యం :**

వసిష్ఠునకు 'విరాజ్' అనే విద్యపై అధికారముంది. దానిని సంపాదించాలని చాలామంది ప్రయత్నించారు. ఇంద్రుడు కూడ దానికి పొందటానికి అభిలషించాడు. ఇంద్రుని కోరిక తెలుసుకున్న వసిష్ఠుడు ఆ విద్యను ఇంద్రునకిచ్చి, ఆతనినుండి ఒక విశిష్టమైన సోమయాగరహస్యాన్ని సంపాదించాడు. ఈ విద్యావినిమయంతో వసిష్ఠుడు ఒక ఎదురులేని యజ్ఞాధికారాన్ని సంపాదించాడు. యజ్ఞం నిర్వహించాలంటే ప్రధానంగా నలుగురు వైదికులు కావాలి. మొదటివాడు హోత, రెండవ వాడు అధ్వర్యుడు, మూడవవాడు ఉద్గాత, నాల్గవవాడు బ్రహ్మ. ఈ నల్గురిలో మొదటి ముగ్గురు ఋగ్యజుస్సామవేదాలకు ప్రతినిధులుగావుంటూ ఆ వేదాలలోని మంత్రాలను పఠిస్తూ యజ్ఞం నిర్వహిస్తూవుంటారు. బ్రహ్మస్థానంలో వున్న వ్యక్తి మొత్తం యజ్ఞకార్యానికి పర్యవేక్షకునిగా వుంటాడు. నిర్వహణలో ఎటువంటి అనుమానాలు వచ్చినా, పొరపాట్లు దొర్లినా సరిచూచే అధికారం అతనికే వుంటుంది. యజ్ఞవాటికకు లోపల బయట కూడ అతనిదే అధికారం. అటువంటి అధికారాన్ని ఇంద్రునినుండి పొందిన సోమయాగ రహస్యం ద్వారా వసిష్ఠుడు సంపాదించాడు. వసిష్ఠుడు, బ్రహ్మ అనే రెండు పదాలు సమానార్థకాలైనాయి. చాలాకాలం వరకు బ్రహ్మస్థానం వసిష్ఠునకు గాని, ఆతని సంతతికి గాని చెందాలి అనే నియమం వుండేది. తరువాతి కాలంలో ఈ జ్ఞానాన్ని పొందిన ఎవ్వరికైనా బ్రహ్మస్థానం అధిష్ఠించే అవకాశం లభించింది. అయితే వసిష్ఠునకు గుర్తుగా వారికి తలపాగా చుట్టబడుతుంది. ఆ తలపాగా ముడి తలకు కుడిప్రక్క విశిష్టంగా కనిపిస్తూ ఉంటుంది. వసిష్ఠుడు, వసిష్ఠ కుటుంబం వారు తలకు కుడి ప్రక్క కొప్పు కలిగి ఉంటారని చెప్పుకున్నాము కదా! దానికి గుర్తే ఈ తలపాగా ముడి.

**సత్యానిదే అంతిమ విజయం :**

మానవాళికి దివ్యజ్ఞానాన్ని అందిస్తూ తన జీవితాన్నే సమాజానికి నీరాజనంగా అర్పించిన వసిష్ఠుడు లౌకికంగా కూడా విశిష్ట స్థానాన్ని ప్రపంచానికి అందించాడు. వారి లౌకిక జ్ఞానానికి అనేక ఉదాహరణములు చూపవచ్చు. మనిషి జీవితకాలం ఎంత అనే చర్చ వచ్చినప్పుడు ఏ మనిషీ కూడాను తన జీవితము యొక్క పరిమాణాన్ని తెలుసుకొనలేడు అన్నారు. 'ఉద్యమించటం యొక్క ప్రాధాన్యం వివరిస్తూ - ఉద్యమకారులదే గెలుపు. వారే సుఖంగా నివసింపగలరు. అభివృద్ధి చెందుతారు. దేవతలు సోమరులను దగ్గరచేర్చరు' అంటారు.

సత్యాసత్యాలను గురించి వసిష్ఠుల అభిప్రాయం ఖచ్చితంగా ఉంది ''ఈ రెండింటికి పోరు శాశ్వతము. అయితే ఏదైతే నిజంగా సత్యంగానూ, నిజాయితీగాను ఉంటుందో దానినే దేవుడు రక్షిస్తాడు. అసత్యాన్ని వమ్ముచేస్తాడు''. సత్యాసత్యాల యుద్ధంలో అంతిమ విజయం సత్యానిదే అని విశ్వసించాడు.

''ఔరసులు - దత్తపుత్రుల విషయంలో ఔరసులే కావాలంటారు. తెలియనివాని సొమ్మునెప్పుడూ తప్పించుకోవాలి. మన సంపదలకు మనము యజమానులుగా ఎల్లప్పుడూ ఉందుముగాక! ఎవరికోపుట్టిన బిడ్డ మన బిడ్డకాదు. ఆవిధంగా అనుకొనే వాడు మూర్ఖుడౌతాడు. నిర్వీర్యమైన జాతికి మనుగడ లేదు. జ్ఞానవంతులు, బలవంతులు ఐన సంతానం పొందటం ఆవశ్యకం'' అంటూ తాను పడిన కష్టాలను జ్ఞాపకం చేసుకుంటూ అటువంటి సంతానం కోసం దేవతలను పదే పదే ప్రార్థిస్తాడు.

శ్రేయో మార్గదర్శి :

వసిష్ఠుడు వేదద్రష్టగానే గాకుండా, యజ్ఞకార్యాలను పర్యవేక్షించే బ్రహ్మగానే గాకుండా, సామాన్య జనోపయోగమైన అనేకమైన కార్యాల్లో నిమగ్నుడై ప్రజాహితాన్ని ప్రజారక్షణను కావిస్తూ మిగిలిన ఋషులకంటే విశిష్టంగా రూపొందాడు. క్షాత్రధర్మాన్ని కూడ బ్రాహ్మణధర్మంతో కలిపి నిర్వహించిన ఘనత వసిష్ఠునకు లభిస్తుంది. అయితే బ్రాహ్మణ ధర్మాన్ని మించినది లేదని, లోకంలో శక్తులన్నీ ఆ ధర్మం ముందు మోకరిల్లక తప్పదని తన ఆచరణ ద్వారా నిరూపించి బ్రహ్మర్షిత్వానికి ప్రతీకగా నిలచాడు. ఇతడు ఇంద్రవరుణుల మధ్య సహభావాన్ని పాదుకొల్పిన వ్యక్తి. ఇంద్రుడు యుద్ధ దైవతము. వరుణుడు ఋతమును కాపాడు దేవుడు. యుద్ధము ద్వారా గెలిచిన జాతులను, లభించిన ప్రదేశములను ఉపయోగకరంగా మలచుకోవడానికి క్రమశిక్షణ అవసరం. అదే ఋతం. దాన్ని కాపాడేవాడు వరుణుడు. అంటే ఇంద్రవరుణుల సహయోగము జాతికి గౌరవాన్ని, సుస్థిరతను కలిగించింది. దానికి కారణభూతుడు వసిష్ఠుడు. ఇతడు దేవతలకు, మనుష్యులకు వారధిలాగా ఉపయోగించాడు. నేటి భారతావని కీర్తి ప్రతిష్ఠలకు ఆనాటి వసిష్ఠుని కార్య కలాపాలు, ఆలోచనా ప్రణాళికలు బీజములనేవి యథార్థము. ఆ వసిష్ఠుని వెలుగు బాటలో పయనించడం విశ్వానికి పరమామోదం.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*